

సామాన్యులకు పెద్దపీట

చందనోత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. 10లో

కనకమ్మకు క్షీరాభిషేక సేవ



విశాఖ : బురుజుపేటలోని కనక మహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
39.0/28.0

వాతావరణం

ఉరుములతో కూడిన జల్లులు, తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి శుక్రవారం చెప్పారు. గంటకు 40–50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందన్నారు.

న్యూస్‌రీల్

6న ప్రధాని రాక

మహారాణిపేట (విశాఖ): భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 6న అనకాపల్లి రానున్నారు. రాజమండ్రి నుంచి హెలికాప్టర్‌లో సాయంత్రం 5.30 గంటలకు అనకాపల్లి దరి రాజుపాలెం వస్తారు. అక్కడ నుంచి బహిరంగ సభ వేదిక వద్దకు రోడ్డు మార్గంలో వస్తారు. సాయంత్రం 5.45 గంటల నుంచి 6.35 గంటల వరకు బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అక్కడ నుంచి రాత్రి 7.10 గంటలకు రోడ్డు మార్గం ద్వారా విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. రాత్రి 7.15 గంటలకు ప్రత్యేక విమానంలో అహ్మదాబాద్‌కు బయలు దేరుతారు.

అనకాపల్లి ఎలక్షన్ క్యాంపెయినింగ్ ఇన్‌చార్జ్‌గా ఆడారి కిషోర్

విశాఖ సిటీ: అనకాపల్లి పార్లమెంట్ ఎలక్షన్ క్యాంపెయినింగ్ ఇన్‌చార్జ్‌గా ఆడారి కిషోర్ నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది.

అనకాపల్లి ఎన్నికల డిప్యూటీ పరిశీలకుడిగా కొండా రాజీవ్

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల డిప్యూటీ పరిశీలకుడిగా కొండా రాజీవ్‌గాంధీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ప్రకటించింది. పార్టీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు తెలిపింది.

యాదవ యువకుడిపై సుందరపు అనుచరుల దాడి



యువకుడి చేతికి గాయమైన దృశ్యం

అచ్యుతాపురం : జనసేన పార్టీ నేతల దాడిలో ఒక యాదవ యువకుడు గాయాల పాలయ్యాడు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయంలో ఈ సంఘటన జరగడం తీవ్ర సంచలనంగా మారింది. జనసేన అభ్యర్థిగా యలమంచిలి నియోజక వర్గం నుంచి పోటీ చేస్తున్న సుందరపు విజయ్‌కుమార్ తీరుకు తగ్గట్టే ఈ ఘటన జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అచ్యుతాపురం మండలంలోని ఎస్‌కేఆర్ లాడ్జిలో శుక్రవారం యాదవ కులస్తుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం నిర్వహించిన భోజనాల వద్ద యాదవ కులానికి చెందిన గొలగాని నాయుడికి , జనసేన కార్యకర్తకు కొద్దిపాటి గొడవ జరిగింది. ఇంతలో విజయకుమార్ పీఏ, డ్రైవర్లు కలిసి నాయుడుపై పిడిగుద్దులతో దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తనను గదిలోకి తీసుకెళ్లి దాడి చేశారని బాధితుడు వాపోయాడు. గతంలోనూ పూడిమడకకు చెందిన ఒక మత్స్యకారుడిపై సుందరపు దాడి చేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో తాజాగా శుక్రవారం అచ్యుతాపురంలో యాదవ యువకుడిపై జరిగిన దాడి అందరిలోనూ ఆందోళన కలిగిస్తుంది.

బాలల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం


విశాఖ విద్య: జాతీయ బాలల పురస్కారాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ స్త్రీ శిశు సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ గొండు సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన 5 నుంచి 18 ఏళ్ల లోపు వయసు గల బాలలు ఈ పురస్కారాలకు అర్హులని పేర్కొన్నారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, పర్యావరణం, క్రీడలు, కళలు, సాహిత్యం, సంగీతం, నృత్యం, చిత్రలేఖనం తదితర అంశాల్లో ప్రతిభావంతులకు ఇదో అరుదైన అవకాశమని తెలియజేశారు. 2025 జనవరిలో రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకోవచ్చన్నారు. అర్హత, ఆసక్తి గల బాలలు జూలై 31 లోపు http:/awards.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా రంగాల్లో ప్రతిభ చూపే విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఉపాధ్యాయులు, వివిధ సంస్థల వారు, తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

గనులపై కన్ను... పోటీకి దన్ను

అనకాపల్లికి వచ్చింది అందుకేనా ?

భారీ బెల్లం మార్కెట్‌తోపాటు మైనింగ్‌కు కేంద్రంగా ఉన్న అనకాపల్లిలో ఎంపీగా పోటీ చేసేందుకు పక్కా ప్లాన్‌తోనే సీఎం రమేష్ రంగప్రవేశం చేసినట్టు తెలుస్తోంది. ఇక్కడ ఉన్న కొండలను పిండి చేసి అక్రమార్జనకు తెరలేపేందుకే ఇంత దూరం వచ్చినట్టు స్పష్టమవుతోంది. ప్రధానంగా అనకాపల్లి చుట్టుపక్కలున్న మైన్లతోపాటు నర్సీపట్నంలో ఉన్న రంగురాళ్లను దోచేందుకే చంద్రబాబు డైరెక్షన్‌లో అడుగుపెట్టారనే చర్చ నడుస్తోంది. పార్లమెంటు సభ్యుడిగా బరిలో నిలిచేందుకు బీ–ఫారం తీసుకునే సమయంలో పక్కనే మైనింగ్ డాన్ ఉండటం ఈ విమర్శలకు బలం చేకూరుస్తోంది.

- అక్రమ మైనింగ్‌పై సీఎం రమేష్ దృష్టి
- మైనింగ్ డాన్ శ్రీనుతో సత్సంబంధాలు
- బీ–ఫారం ఇచ్చే సమయంలో ఇద్దరూ చెట్టాపట్టాల్
- కొండలను, రంగురాళ్లను దోచుకునే పక్కా ప్లాన్





యథేచ్ఛగా మైనింగ్ తవ్వకాలు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: చంద్రబాబు చెబితేనే వచ్చాను.. ఉత్తరాంధ్రకు పెద్దదిక్కుగా ఉంటానని ప్రకటించుకున్న సీఎం రమేష్ మాటల్లో మర్మం ఇప్పుడు అందరికీ అర్థమవుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో అనకాపల్లిలోని కొండలను నుగ్గు చేసి భారీగా అక్రమ తవ్వకాలు చేపట్టిన వెంగమాంబ శ్రీనుతో కలిసి బీ–ఫారం తీసుకున్న ఫొటోలు చక్కర్లు కొట్టడంతో నాన్ లోకల్ నేత పక్కా స్కెచ్ తేటతెల్లమవుతోంది. వెంగమాంబ పేరుతో మైనింగ్ అధికారులను వెర్రిమాలోకాలను చేసి అక్రమ మైనింగ్‌తో దర్జాగా కోట్లాది రూపాయల మేర దండుకున్న చరిత్ర శ్రీనివాస్ చౌదరికి ఉంది. ఖజానాకు రావాల్సిన రాయల్టీ వగైరాలను ఎగ్గొటి సొంత జేబులు నింపుకున్న సదరు ఉల్లంఘనుడి సహాయ సహకారాలతో ఇప్పుడు అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తుండటంతో ఈ అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి.

అంతేకాకుండా తనకు తానుగా ఉత్తరాంధ్రకు పెద్దదిక్కుగా చెప్పుకుంటూ ఇటు అల్లూరి నుంచి అటు శ్రీకాకుళం జిల్లా వరకు ఉన్న వనరులను దోచేందుకే ఉత్తరాంధ్రకు పెద్ద దిక్కుగా ఉంటానంటూ చెప్పుకుంటున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా అనకాపల్లి జిల్లాలోని గనులను దోచుకునేందుకే ఈ ఘనుడు వచ్చాడని అర్థమవుతోంది.

ఇదీ వెంగమాంబ బాగోతం...!

వాస్తవానికి అనకాపల్లి ఎంపీ బరిలో సీఎం రమేష్ ఉండాలని నిర్ణయించుకున్న సమయంలోనే మైన్స్‌పై ఆరా తీసినట్టు తెలుస్తోంది. గతంలో తెలుగుదేశం పార్టీకి దగ్గరగా ఉండి... 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయిన తర్వాత వెంగమాంబ క్వారీ సంస్థ అధినేత శ్రీనివాస్ చౌదరి బీజేపీకి దగ్గరగా వెళ్లారు. ఈ పరిస్థితుల్లో సీఎం రమేష్ కూడా శ్రీనివాస్ చౌదరికి దగ్గరయ్యారు. ఎంతగా దగ్గరయ్యారంటే.... బీ–ఫారం తీసుకునే సమయంలోనే అక్రమ మైనింగ్ వీరుడితో చెట్టాపట్టాలేసుకునేంతగా.. అక్రమ మైనింగ్ డాన్‌గా వీవీఆర్ స్టోన్‌క్రషర్స్ అధినేత శ్రీనివాస్ చౌదరికి పెట్టింది పేరు. అక్రమ మైనింగ్ అధికారులతో కుమ్మక్కై, కోట్లాది విలువ చేసే వనరులను దోచుకున్న వెంగమాంబ శ్రీనివాస్ చౌదరి ఇటీవల మళ్లీ తెరపైకి వచ్చాడు. అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వచ్చిన సీఎం రమేష్‌కు అత్యంత ఆప్తుడిగా ఎన్నికల ప్రచారాల్లో శ్రీనివాస్ చౌదరి ప్రచారం చేస్తున్నాడు. సీఎం రమేష్ ఎంపీ అయితే జిల్లాలో ఎక్కడా కొండలు లేకుండా అనకొండ శ్రీనివాస్ చౌదరి దోచుకుంటారనే అనుమానాలున్నాయి. అయితే కడప నుంచి వచ్చిన సీఎం రమేష్ లాంటి వారిని ఓడగొడితేనే ఇలాంటి వాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట వేయగలమని స్థానిక ప్రజలు భావిస్తున్నారు. అనకాపల్లి మండలం సీతానగరంలో సర్వే నెం.193, 303లో వీవీఆర్ స్టోన్ క్రషర్స్ ఖనిజ సంపదను అక్రమంగా దోచేసి మైనింగ్ చేయడంతో మైన్స్ శాఖ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు గత ఏడాది జూలై 8న క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి శ్రీనివాస్ చౌదరికి దాదాపు రూ.33 కోట్ల జరిమానా విధించారు. అయినా లెక్కచేయకుండా మైనింగ్ డాన్ శ్రీనివాస్ చౌదరి స్థానిక మైనింగ్ అధికారులతో చేతులు కలిపి యథేచ్ఛగా మైనింగ్ కొనసాగిస్తున్నారు. వందలాది లారీల్లో ఖనిజం తరలిపోతుందని స్థానికులు చేసిన ఫిర్యాదులను సైతం అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వమంటే లెక్కలేనితనం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. జరిమానాకు సంబంధించి నోటీసులు జారీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, శ్రీనివాస్ చౌదరి ఆగడాలకు తొత్తులుగా పనిచేస్తున్నారని అప్పట్లో ముగ్గురు అధికారులను, విశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డీవీవీ సత్యనారాయణరెడ్డిని ఏలూరు బదిలీ చేశారు. వెంగమాంబ స్టోన్ క్రషర్స్‌లో జరిగిన దోపిడీ అంతా ఇంతా కాదు. ఏకంగా 5 లక్షల 68 వేల 923 క్యూబిక్ మీటర్ల ఖనిజం దోచుకున్నారని మైన్స్ విజిలెన్స్, ఎన్ఫోర్స్‌మెంట్ ఏడీ ప్రతాప్‌రెడ్డి అప్పట్లో నిర్ధారించారు. దీనికి రూ.32.36 కోట్ల మేర జరిమానా విధించారు. అయినప్పటికీ ఆగకుండా అక్రమ మైనింగ్ చేశారనే ఆరోపణలున్నాయి. వాస్తవానికి గ్రామీణ జిల్లాగా పచ్చని వ్యవసాయ గ్రామాలతో ఉన్న అనకాపల్లి జిల్లాలో ఎంతో విలువైన ఖనిజ సంపద ఉంది. ఇప్పటికే శ్రీనివాస్ చౌదరి లాంటి అక్రమ మైనింగ్ డాన్‌లు జిల్లాలో ఖనిజాన్ని దోచేస్తున్నారు. వీరికి తోడు సీఎం రమేష్ లాంటి వాళ్లు వస్తే జిల్లాను పూర్తిగా సర్వనాశనం చేసే పరిస్థితి ఎదురుకావచ్చు.

చంద్రబాబు డైరెక్షన్‌లోనే..

వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన సీఎం రమేష్ మొదటి నుంచీ తెలుగుదేశం పార్టీలో క్రియాశీలంగా ఉన్నారు. ఆ పార్టీ నుంచే రాజ్యసభ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఆ తర్వాత చంద్రబాబు డైరెక్షన్‌లోనే బీజేపీలో చేరారు. అయినప్పటికీ ఆయన రాజ్యసభ అభ్యర్థిత్వంపై వేటు పడలేదు. దర్జాగా చివరి వరకూ ఆ పదవిని అనుభవించారు. తిరిగి రాజ్యసభకు వెళ్లాలని భావించినప్పటికీ ఆ అవకాశాన్ని బీజేపీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో బీజేపీతో పొత్తు కుదుర్చుకునేందుకు తహతహలాడిన చంద్రబాబు... అనకాపల్లి పార్లమెంటు సీటును మాత్రం తన వ్యక్తికే ఉండాలని భావించారు. మొదటగా ఈ సీటు నుంచి నాగబాబు పోటీ చేయాలని భావించారు. ఇందుకు అనుగుణంగా పావులు కూడా కదిపారు. అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ఉన్న భారీ గనులను దృష్టిలో ఉంచుకున్న బాబు... ఈ సీటు నుంచి నాగబాబు బరిలో ఉండటాన్ని ఇష్టపడలేదు. దీని ఫలితంగానే ఈ సీటును బీజేపీ గట్టిగా కోరడం... పవన్ ఈ సీటును వదులుకోవడం జరిగిపోయాయి. ఫలితంగా సీఎం రమేష్ తెర మీదకు వచ్చారు. ఈ వ్యవహారమమంతా బాబు డైరెక్షన్‌లోనే జరిగిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



బీజేపీ ప్రతినిధుల నుంచి బీ–ఫారం అందుకుంటున్న సీఎం రమేష్, వృత్తంలో ఉన్న వ్యక్తి వీవీఆర్ స్టోన్‌క్రషర్స్ అధినేత శ్రీనివాస్ చౌదరి (ఫైల్)

ఎన్నికల నిర్వహణకు సర్వ సన్నద్ధం

- ముందస్తు చర్యల్లో జిల్లా యంత్రాంగం
- కేంద్ర పరిశీలకుడు దర్జీత్‌సింగ్ మంగత్



ఈసీ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎన్నికల అధికారులు దర్జీత్‌సింగ్‌మంగత్, రాకేష్‌కుమార్

తుమ్మపాల : ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలను తీసుకుంటున్నట్లు సాధారణ పరిశీలకులు దర్జీత్ సింగ్ మంగత్ అన్నారు. దేశంలో నాలుగో దశ ఎన్నికలు జరిగే రాష్ట్రాల ఎన్నికల అధికారులతో భారత ఎన్నికల కమిషన్, సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి ఆయనతో పాటు జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కె.వి.మురళీకృష్ణ పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సమీక్షలో ఆయనతో పాటు రాకేష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా లో ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఏర్పాటయ్యాయని, వాటిని స్వయంగా పరిశీలిస్తున్నామన్నారు.

పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు గోపాలస్వామి మాట్లాడుతూ అంతర్ రాష్ట్ర చెక్ పోస్టులు, అంతర్ జిల్లాల చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, ఎప్పటికప్పుడు సీజర్ అంశాలు, ఎన్నికల వ్యయ పరిశీలన జిల్లాలో పక్కాగా జరుగుతోందని తెలిపారు. ఓటరు ఇన్ఫర్మేషన్ స్లిప్పులు, బీఎల్వోల ద్వారా సంబంధిత ఓటరుకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

శతశాతం పారదర్శకంగా..

శత శాతం వెబ్ కాస్టింగ్, మైక్రో అబ్జర్వర్ నియామకం, అవసరం మేరకు వీడియోగ్రఫీ చేపడుతున్నామని పరిశీలకులు చెప్పారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో నిష్పాక్షికంగా పారదర్శకంగా ఎన్నికల నిర్వహణకు అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని వివరించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు షెడ్, వీల్ చైర్స్, ర్యాంపు, మెడికల్ టీమ్ ఫ్లూయిడ్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఎస్పీ కె.వి.మురళీకృష్ణ మాట్లాడుతూ సెన్సిటివ్ కేంద్రాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నివారించడానికి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు ఎస్.సంజయ్ గాంధీ, ఆశిష్ కుమార్ పాండే , నియోజకవర్గాల ఆర్‌ఓలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

ఈ పాపం చంద్రబాబుదే..

- అవ్వాతాతలకు తప్పని పింఛను కష్టాలు
- రెండో రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- 98.78 శాతం డీబీటీ ద్వారా, 96.19 శాతం సచివాలయ సిబ్బంది ద్వారా పెన్షన్ల బట్వాడా



దేవరాపల్లి ఎస్‌బీఐ వినియోగారుల సేవా కేంద్రం వద్ద క్యూలైన్లలో నిరీక్షణ చేస్తున్న వృద్ధులు

తుమ్మపాల, దేవరాపల్లి, రోలుగుంట : చంద్రబాబు కుట్ర ఫలితంగా అవ్వాతాతలకు రెండో రోజూ పింఛను కష్టాలు తప్పలేదు. చంద్రబాబు, నిమ్మగడ్డ రమేష్ ఫిర్యాదు ఫలితంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక పింఛన్ల నగదును లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. అయితే ఖాతాలు సరిగా లేకపోవడం, ఇతరత్రా సమస్యలతో పింఛను నగదు కోసం ముఖ్యంగా వృద్ధులు బ్యాంకుల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చింది. తీవ్రమయిన ఎండలో వారు అష్టకష్టాలు పడ్డారు. అనారోగ్యం, మంచంపై నుంచి లేవలేని వారికి ప్రభుత్వం నేరుగా సచివాలయ సిబ్బంది ద్వారా నగదు పంపిణీ చేసింది.

ఈ మేరకు జిల్లాలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ శుక్రవారం నాటికి 98 శాతం పూర్తయిందని డీఆర్డీఏ పీడీ కె.శచిదేవి తెలిపారు. ఇంటింటికీ 64,850 మందికి రూ.17,18,74,000 నగదు పంపిణీ చేయగా, ఇంకా కేవలం 2,570 మంది మాత్రమే మిగిలి ఉన్నారన్నారు. ఇక డీబీటీ ద్వారా 1,97,790 మందికి గాను 1,95,269 మందికి రూ.58,58,09,000 పింఛనుదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. మూడు రోజుల్లో మొత్తం రూ.75,76,83,000 పంపిణీ జరిగిందని, 98.78 శాతం డీబీటీ ద్వారా, 96.19 శాతం సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ నగదు పంపిణీ పూర్తయిందని తెలిపారు.

రెండు రోజులుగా తిరుగుతున్నా...



మాది తెనుగుపూడి గ్రామం. వృద్ధాప్యంలో ఉన్న నేను చేతి కర్ర ఊత ఉంటే తప్ప ఇంటి నుంచి బయటకు అడుగు వేయలేను. నెల నెలా వలంటీర్ ఇంటికి వచ్చి పింఛను డబ్బులు ఇచ్చేవారు. నాకు ఏ ఇబ్బంది ఉండేది కాదు. వలంటీర్ పింఛను ఇవ్వకూడదని ఎవరో ఫిర్యాదు చేస్తే ఈ నెల బ్యాంక్ అకౌంట్లో వేశారని మావోళ్లు చెప్పారు. మా కోడలితో కలిసి ఆటోలో నిన్న దేవరాపల్లి యూకో బ్యాంక్‌కు వచ్చాను. ఎండ ధాటికి ఉక్కిరిబిక్కిరి అయ్యాను. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పస్తులు ఉన్నా ప్రయోజనం లేదు. నా వంతు వచ్చేసరికి బ్యాంకు మూసేశారు. మరలా ఈ రోజు మా కోడలితో కలిసి ఆటోలో వచ్చాను. రెండు రోజులు నాతో పాటు నా కోడలు పనులు మానుకోవాల్సి వచ్చింది. రెండు రోజులకు ఆటో చార్జీలతో పాటు ఇతరాత్ర ఖర్చులయ్యాయి. ఎండల్లో బ్యాంక్‌ల వద్ద నాలాంటి వారంతా నరకం చూశారు.

–చిన్నపు తమ్మయ్య, వృద్ధుడు తెనుగుపూడి, దేవరాపల్లి మండలం

చంద్రబాబు వల్లే మాకీ తిప్పలు



రెండు రోజులుగా పింఛను కోసం గ్రామీణ వికాస్ బ్యాంకుకు వచ్చి తిరిగి పోతున్నాను. బ్యాంకులో ఫీల్డ్ ఆఫీసర్ నీ బ్యాంకు ఖాతా చచ్చిపోయిందని చెప్పి, ఏవో కాగితాలు తెచ్చి నింపారు. ఖాతాను బతికించి సమస్య పరిష్కరించారు. రెండు మాసాల క్రితం వరకూ వలంటీర్ ఇంటికి వచ్చి మామ్మ అని పలకరించి నవ్వుతూ పింఛన్ ఇచ్చేవాడు. మరలా ఆ రోజులే రావాలి. మమ్మల్ని కష్టాలు పెడుతున్న మాయ చంద్రబాబు వద్దు. జగన్‌బాబే కావాలి. ఈ ఎన్నికల్లో ఆ బాబే విజయం సాధించాలి. చంద్రబాబు కంపెనీ సెలవు తీసుకోవాలి. మమల్ని బాధపెట్టిన వారు బాగుపడలేరు. జగన్‌బాబుకే ఆ దేవుడు, నా ఆశీర్వాదం. – పారుపల్లి ఎర్రయమ్మ, వృద్ధురాలు, రోలుగుంట గ్రామం, మండలం

హోమ్ ఓటింగ్ ప్రారంభం

- వినియోగించుకున్న వృద్ధులు, దివ్యాంగులు
- పటిష్ట బందోబస్తు మధ్య ప్రక్రియ నిర్వహణ

తుమ్మపాల/నక్కపల్లి : జిల్లాలో శుక్రవారం ప్రారంభమైన హోమ్ ఓటింగ్‌లో 45 శాతం పైబడి అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వృద్ధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అందరికీ మే 13న ఓటింగ్ ఉంటే వీళ్లు మాత్రం ముందుగానే తమ ఓటును వినియోగించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో మొదటి రోజు 266 మంది హోమ్ ఓటింగ్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో అత్యధికంగా 75 మంది వృద్ధులు, వికలాంగుల ఇళ్లకు వెళ్లిన అధికారుల బృందం బ్యాలెట్ పేపర్లు అందించి ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించారు. చోడవరంలో 56 మంది, పాయకరావుపేట 43, మాడుగుల 34, యలమంచిలి 49, నర్సీపట్నం నియోజకవర్గంలో 9 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్టు జిల్లా పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి రోజారాణి తెలిపారు.

తుమ్మపాల గ్రామం సచివాలయం–2 పరిధిలో నివాసముంటున్న రాపేటి భాస్కరరావు 90 శాతం అంగవైకల్యం గల దివ్యాంగుడు. శుక్రవారం తన ఓటు హక్కును హోమ్ ఓటింగ్ ద్వారా వినియోగించుకున్నట్లు తెలిపాడు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎలక్షన్ కమిషన్ హోమ్ ఓటింగ్‌కు అవకాశం కల్పించడంతో ఫారం–12డి దరఖాస్తు చేసుకున్నానని, అధికారుల బృందం తమ ఇంటికి వచ్చి బ్యాలెట్ పేపర్లు ఇవ్వడంతో తన ఓటు హక్కును వినియోగించుకున్నానన్నాడు.





ఓటు వేసినట్లు సిరా గుర్తు చూపిస్తున్న దివ్యాంగుడు రాపేటి భాస్కరరావు, వృద్ధురాలు సన్యాసమ్మ

ఇల్లే పోలింగ్ బూత్

ఈసారి ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన నూతన విధానంతో ఇల్లే పోలింగ్ బూత్‌గా మారిపోతోంది. 85 ఏళ్లు నిండిన వృద్ధులు, మంచానికే పరిమితమైన వారికి, పోలింగ్ బూత్‌కు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేని వారికి ఈ దఫా ఎన్నికల సంఘం హోమ్ ఓటింగ్ సౌకర్యం కల్పించింది. పోలింగ్ సిబ్బంది అటువంటి వారి ఇళ్లకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ ఇచ్చి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నారు. ఐదు రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. నియోజకవర్గంలో ఈ విధంగా హోమ్ ఓటింగ్ కోసం ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. శుక్రవారం వీరంతా ఆర్‌వో కార్యాలయం నుంచి పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులు తీసుకుని వెళ్లారు. ఓటరు ఇంటి వద్ద ప్రత్యేకంగా కంపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసి పోస్టల్ బ్యాలెట్ విధానంలో ఓటు వినియోగించుకుని బ్యాలెట్ బాక్సులో వేసేలా చర్యలు తీసుకున్నారు. ఓటరు ఇంటి వద్ద నిర్వహించిన ఈ ప్రక్రియకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆర్‌వో గీతాంజలి తెలిపారు.

జగన్ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం

- ఆత్మీయ సమావేశంలో పలువురు నేతలు
- వైఎస్సార్‌సీపీతోనే అభివృద్ధి, సంక్షేమం అని వెల్లడి

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా యాదవ కులస్తులకు రాజకీయంగా ఉన్నత పదవులు దక్కాయని, సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి యాదవులంతా అండగా నిలవాలని ఉప ముఖ్యమంత్రి, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, విశాఖ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, ఎంపీ బీవీ సత్యవతి, ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. తుమ్మపాల బంగారురాజు కల్యాణ మండపంలో నియోజకవర్గ యాదవ కలస్తుల ఆత్మీయ సమావేశం కనకసోమునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బూడి ముత్యాలనాయుడు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నవరత్నాల్లో భాగంగా కుల, మతాలకు అతీతంగా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేశారన్నారు. పేదవాడి సొంతింటి కల వైఎస్సార్‌సీపీ పాలనలో నెరవేరిందన్నారు. అనకాపల్లి పార్లమెంట్‌పై అవగాహన లేని వ్యక్తి సీఎం రమేష్‌కు మే 13న జరిగే ఎన్నికల్లో ఓటుతో ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గర పడిందన్నారు. బ్యాంకులను మోసం చేసి, సారా వ్యాపారం చేసి కడప నుంచి వచ్చిన సీఎం రమేష్‌కు, స్థానికుడినైన తనకు పోటీ జరుగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా తనను గెలిపించినట్లయితే సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తామన్నారు. పట్టణంలో యాదవ కులస్తుల భవన నిర్మాణానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మేయర్ హరి వెంకట కుమారి మాట్లాడుతూ విశాఖ, తిరుపతి మేయర్లుగా, రాజ్యసభలో ఇద్దరు, రాష్ట్రంలో ఇద్దరు యాదవ కులస్తులకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆమె పేర్కొన్నారు. గత పార్టీలు యాదవ కులస్తులను ఓటర్లుగా మాత్రమే వాడుకున్నాయని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించినట్లు చెప్పారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ ఈ ఎన్నికలు ధనవంతులకు, సామాన్యులకు మధ్య జరుగుతున్నాయని తెలిపారు. సామాన్యుల తరపున మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పోటీ చేస్తున్నట్లు ఆమె చెప్పారు. గ్రామాల్లో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేసి, చక్కటి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, నియోజకవర్గ యాదవ సంఘాల నాయకులు కరక శేషు, వియ్యపు భూలోకనాయుడు, సంతోష్‌కుమారి, కారుకొండ కన్న, కుండల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



యాదవ కులస్తుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

వలస పక్షి సీఎం రమేష్‌ను ఓడించాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకన్న



దేవరాపల్లి: వలస పక్షి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను ఓడించి ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలను కోరారు. శుక్రవారం దేవరాపల్లిలో ఆయన మాట్లాడుతూ సీఎం రమేష్ పెత్తందారు పోకడలు ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమన్నారు. ధన బలంతో ఓట్లు కొనుగోలు చేయాలని చూస్తున్నాడని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఐదు వేలకుపైగా కిరాయి వ్యక్తులను మోహరింప చేసి ఓటర్లను ప్రలోభ చేస్తున్నాడన్నారు. ఇలాంటి విష సంస్కృతి అనకాపల్లి ప్రశాంతతకు గొడ్డలి పెట్టు అన్నారు. ఇటువంటి వ్యక్తిని పార్లమెంట్‌లో అడుగు పెట్టనివ్వకుండా తగిన గుణపాఠం చెప్పాలన్నారు. అత్యంత కీలకమైన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేసి బీజేపీ, టీడీపీ, జనసేన కూటమిని ఓడించాలని విజ్ఞప్తి చేశారు.

హ్యాండ్లూమ్ డిప్లొమా కోర్సుకు దరఖాస్తులు

తుమ్మపాల: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (తిరుపతి) డిప్లొమా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఆర్.వి.మురళీకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లేటరల్ ఎంట్రీ హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ కోర్సుల్లో రెండు, మూడేళ్ల డిప్లొమా కోర్సుకు వచ్చే నెల ఒకటో తేదీ లోపున దరఖాస్తు చేసుకోవాలన్నారు. విద్యార్థులు టీటీటీ.జీ జీజ్ఞిటిజట.భిొరఖ వెబ్‌సైట్, ఫోన్ నెం.93999 98661, 98661 69908, 90102 43054ను సంప్రదించాలన్నారు.

పరస్పర ఫిర్యాదులతో 8 మందిపై కేసు

అనకాపల్లి: ఇరువర్గాల వారు పరస్పర ఫిర్యాదులతో ఎనిమిది మందిపై కేసు నమోదు చేశామని పట్టణ ఎస్ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... స్థానిక శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఏడిద ఝూన్సీ, ఆమె కుమారుడు ఆదర్శ, ఆదర్శ స్నేహితుడు భానులపై ఇదే ప్రాంతానికి చెందిన బొమ్మల మహేష్, పండుతోపాటు మరో ఇద్దరు ఈ నెల ఒకటో తేదీన హత్యా ప్రయత్నం చేశారు. దీనిపై ఝూన్సీ ఫిర్యాదు చేసింది. ప్రతిగా వీరిపై కులం పేరుతో దూషించినట్లు సాలాపు సూరిఅప్పారావు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

చందనోత్సవంలో సామాన్యులకు పెద్దపీట

- దర్శన టికెట్లు పదివేల వరకు కుదింపు
- రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున ,చిత్రంలో దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ తదితరులు

సింహాచలం: చందనోత్సవంలో సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ చెప్పారు. ఈ నెల 10న వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు కలెక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో పకడ్బందీగా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. కలెక్టర్ మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, నగర సంయుక్త సీపీ ఫకీరప్పతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం సింహగిరిపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సారి 29,500 మంది భక్తులు ఒకేసారి వేచి ఉండేలా ఏడు కిలోమీటర్ల మేర దర్శనాల క్యూలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ చందనోత్సవం రోజు తెల్లవారు జామున 3.30 నుంచి 4.30గంటల మధ్య మాత్రమే దేవస్థానం అనువంశిక ధర్మకర్త కుటుంబానికి, హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, దాతలకు మాత్రమే అంతరాలయ దర్శనం కల్పించడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత మరెవరికీ అంతరాలయ దర్శనాలు ఉండవని తెలిపారు. గతేడాది మంచినీటి సరఫరా కేంద్రాలు 130 ఉంటే ఈ సారి 180కి పెంచినట్లు తెలిపారు. మొబైల్ టాయిలెట్లు 240, 200 వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

టికెట్ల కుదింపు

గతేడాది రూ. 300, రూ.1000, రూ.1500 టికెట్లు 49 వేలు జారీ చేయగా ఈ ఏడాది 35 వేలు మాత్రమే జారీ చేసినట్టు కలెక్టర్ తెలిపారు. 11 చోట్ల టికెట్ల స్కానర్లు పెడతామన్నారు. భక్తులకు ఎండ వేడి తగలకుండా క్యూ లైన్లపై షామియానాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఈసారి 40 పెద్ద బస్సులు, 40 మినీ బస్సులు,15వరకు ఇన్నోవా వెహికల్స్ మాత్రమే నడపడం జరుగుతుందన్నారు. జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప మాట్లాడుతూ 2590 మంది సివిల్ పోలీస్, నాలుగు ప్లాటూన్ ఏఆర్, స్పెషల్ రోప్‌పార్టీలతో చందనోత్సవం బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులతో జాయింట్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్. శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ కొండదిగువ ఆరుచోట్ల వాహనాల హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశామని, అక్కడ మజ్జిగ, మంచినీరు అందించడం జరుగుతుందన్నారు. సమావేశంలో జీవీఎంసీ సంయుక్త కమిషనర్ విశ్వనాన్, దేవస్థానం అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చందనోత్సవ టికెట్ల విక్రయాలు ప్రారంభం

చందనోత్సవ టికెట్ల విక్రయాలను శుక్రవారం రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ప్రారంభించారు. తొలి టికెట్‌ను కమిషనర్ కొనుగోలు చేశారు. ఈసారి టికెట్ల రూపకల్పన పకడ్బందీగా చేసినట్టు చెప్పారు. రూ. 300, రూ.1000 టికెట్లు సింహగిరిపై ఉన్న ప్రత్యేక కౌంటర్‌తో పాటు మహారాణిపేట, అక్కయ్యపాలెంలోని యూనియన్ బ్యాంకులతో పాటు సింహాచలం, సాలిగ్రామపురం (అక్కయ్యపాలెం బ్రాంచ్), బిర్లా జంక్షన్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌ల్లో ఈనెల 7వ తేదీ వరకు టికెట్లు అందుబాటులో ఉంటాయని దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఒక దరఖాస్తుపై 4 టికెట్లు మాత్రమే జారీ చేయనున్నట్టు వెల్లడించారు. అలాగే టీటీటీ.ౖ ఖిరుఖ ఞటౖ ఇజౌరి.జీ ు వెబ్‌సైట్ ద్వారా టికెట్లు లభ్యమవుతాయని పేర్కొన్నారు.



మీ చదువు బాధ్యత మాదే: నక్కపల్లి మండలంలో చిన్నారులను ఎత్తుకుని ఆప్యాయంగా పలకరిస్తున్న పాయకరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు



మీ నవ్వే మాకు భరోసా: బుచ్చెయ్యపేట మండలం ఎస్.ఎల్.నగర్‌లో చిన్నారిని ఎత్తుకుని లాలిస్తున్న చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మశ్రీ



ఇదే మన గుర్తు: అనకాపల్లి 82వ వార్డు న్యూ కాలనీలో దివ్యాంగుడిని ఓటు అడుగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



మీ మనవరాలిగా ఆశీర్వదించండి: మాడుగుల మండలం గొప్పూరులో వృద్ధురాలిని అభ్యర్థిస్తున్న మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

చోడవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చినఅప్పలనాయుడు సమీక్ష



పార్టీ నాయకులతో సమీక్షిస్తున్న పార్టీ ఎన్నికల పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు

చోడవరం: పార్టీ విజయమే లక్ష్యంగా నాయకులంతా సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్‌సీపీ చోడవరం నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు శరగడం చినఅప్పలనాయుడు కోరారు. చోడవరం పట్టణంలో 3, 4, 5, 6 వార్డులకు చెందిన పార్టీ ముఖ్య నాయకులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఆయా వార్డుల్లో ప్రస్తుతం పార్టీ పరిస్థితి, విజయావకాశాలు మరింత మెరుగుపడేందుకు తీసుకోవాల్సిన చర్యలపై నాయకులతో చర్చించారు. చోడవరం పట్టణంలో గత ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీ వైఎస్సార్‌సీపీ సాధించే దిశగా ప్రతీ నాయకుడు, కార్యకర్త సమష్టిగా అంకితభావంతో పనిచేయాలన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. నాయకుల మధ్య చిన్నచిన్న విభేదాలుంటే, వాటిని వదిలేసి అంతా పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితే ప్రజలకు ఏవిధంగా మరింత మేలు చేస్తారో తెలియజేయాలన్నారు. ప్రతీ కార్యకర్తను కలుపుకొని ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ప్రజలంతా ఓట్లు వేసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగులాపల్లి రాంబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంపలి ఆనందీశ్వరరావు, హారిక రామకృష్ణ, డీఆర్‌యూసీ మెంబరు బొడ్డు శ్రీరామ్మూర్తి, పప్పల రమణమూర్తి, పార్టీ జిల్లా ప్రతినిధి శరగడం చిమ్మినాయుడు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ కంట్లో కారం

రైతు కుటుంబం దాడి

యలమంచిలి రూరల్: స్థానిక విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ చెక్కా నూకరాజు కంట్లో కారం కొట్టి ఓ కుటుంబానికి చెందిన ముగ్గురు దాడికి పాల్పడిన ఘటన యలమంచిలి మండలం గూండ్రుబిల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ గ్రామంలో ఓ వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ విషయంలో తలెత్తిన వివాదమే ఈ ఘటనకు కారణమని యలమంచిలి రూరల్ ఎస్సై సింహాచలం శుక్రవారం రాత్రి మీడియాకు తెలిపారు. గ్రామానికి చెందిన రైతు వైబోయిన రమణ 2019లో వ్యవసాయ మోటారు కనెక్షన్ కోసం డిపాజిట్ చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్ వేయించుకున్నాడు. దీనికి మూడు కనెక్షన్లు ఇచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే రెండు విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. మూడో కనెక్షన్ తనకు అవసరం ఉందని, ఇందుకోసం దరఖాస్తు కూడా చేసుకున్నానని రైతు రమణ విద్యుత్ శాఖ అధికారులకు చెప్పాడు. ఇంతలో రెండ్రోజుల క్రితం సమీపంలో ఉన్న మరో రైతుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి ఏఈ ప్రయత్నించారు. దీనిని వ్యతిరేకించిన రైతు వైబోయిన రమణ తాను డిపాజిట్ చెల్లించగా వేసిన ట్రాన్స్‌ఫార్మర్‌తో తనకే అవకాశం ఇవ్వాలని పట్టుబట్టాడు. ఈ నేపథ్యంలో మరో రైతుకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి ఆ ప్రాంతానికి వెళ్లిన యలమంచిలి విద్యుత్ శాఖ ఏఈ నూకరాజుపై రైతు వైబోయిన రమణ, అతని కుమారుడు నాగేశ్వర్రావు, కుమార్తె కంట్లో కారం కొట్టి దాడికి పాల్పడ్డారు. వెంటనే ఏఈ యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్నారు. ఏఈ నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు యలమంచిలి రూరల్ ఎస్సై సింహాచలం తెలిపారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య



రాజేష్ మృతదేహం

పాయకరావుపేట: తన స్నేహితుడు బంగారు సంతోష్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడని మనస్తాపంతో పట్టణంలో దుర్గాకాలనీకి చెందిన గుడాల రాజేష్(21) ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. గుడాల రాజేష్‌తోపాటు మరి కొంతమంది స్నేహితుల మధ్య ఘర్షణ తలెత్తిందన్నారు. ఈ విషయమై రాజేష్‌పై సంతోష్‌కుమార్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశామన్నారు. దీంతో మనస్తాపం చెందిన రాజేష్ గురువారం రాత్రి తన ఇంటి వద్ద ఉరేసుకున్నాడని తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సికింద్రాబాద్-బ్రహ్మపూర్ మధ్య సమ్మర్ స్పెషల్స్

తాటిచెట్లపాలెం: వేసవి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్-బ్రహ్మపూర్-సికింద్రాబాద్ మధ్య పలు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్ల వివరాలిలా..

- సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07035) రైలు ఈ నెల 11, 14 తేదీల్లో రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07036) రైలు ఈ నెల 12, 15 తేదీల్లో సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.
- సికింద్రాబాద్-బ్రహ్మపూర్(07027) స్పెషల్ రైలు ఈ నెల 10వ తేదీ రాత్రి 8.45 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.33 గంటలకు దువ్వాడ చేరుకుని, తిరిగి 9.38 గంటలకు బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 2.45 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది.
- తిరుగు ప్రయాణంలో బ్రహ్మపూర్-సికింద్రాబాద్(07028) రైలు ఈ నెల 11న సాయంత్రం 4.45 గంటలకు బ్రహ్మపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.55 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.05 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

మాకవరపాలెంలో టీడీపీకి గట్టి ఎదురుదెబ్బ



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే గణేష్, తదితరులు

వైఎస్సార్‌సీపీలోకి 100 కుటుంబాలు చేరిక

నర్సీపట్నం: తెలుగుదేశం పార్టీకి మరోసారి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఎన్నికలకు కొద్ది రోజులే ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీలోకి భారీగా వలసలు కొనసాగుతున్నాయి. మాకవరపాలెం మండలం రాచపల్లి శివారు కొత్తపాలెం, పాపయ్యపాలెం గ్రామాల నుంచి వంద కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరంతా శుక్రవారం పార్టీ సీనియర్ నేత రుత్తల యర్రాపాత్రుడుతో కలసి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్‌గణేష్ తన క్యాంపు కార్యాలయంలో పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ముందు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరడం శుభ సూచికమన్నారు. పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, నర్సీపట్నం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ భద్రాచలం, యూత్ అధ్యక్షుడు పిల్లా శ్రీను, సేవాదళ్ అధ్యక్షుడు ఇటంశెట్టి శ్రీను, రాచపల్లి, పాపయ్యపాలెం పార్టీల నేతలు పెట్ల దొరబాబు, యర్రా లోవ, పైల సత్తిబాబు, రుత్తల నాయుడు పాల్గొన్నారు.

మాజీ మావోయిస్టు చెడ్డా భూషణం వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆహ్వానించిన ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



మావోయిస్టు పార్టీ నాయకుడు చెడ్డా భూషణంకి పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

మధురవాడ (విశాఖ) : మావోయిస్టు పార్టీలో 32 ఏళ్లపాటు కీలకంగా పనిచేసిన సీనియర్ నాయకుడు, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం ముళియాపుట్‌కు చెందిన చెడ్డా భూషణం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనకు శుక్రవారం వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమం మధురవాడ ఐటీ సెజ్ జంక్షన్ వద్ద గల వైవీ సుబ్బారెడ్డి నివాసంలో జరిగింది. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అవుతారన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని, వారికి ఎప్పటికీ గౌరవం తగ్గదని చెప్పారు. గత ఐదేళ్లలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు పేదరికాన్ని తగ్గించడంతోపాటు పేదలకు విద్య, వైద్యం, ఇళ్లు వంటి వాటిని చేరువ చేశాయన్నారు. సమాజానికి మేలు చేస్తున్న కార్యక్రమాలు, సంక్షేమ పాలన, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పాడేరు నియోజకవర్గ పరిశీలకురాలు పీలా వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

మెడికల్ విద్యార్థి దుర్మరణం

- మరో ఇద్దరి పరిస్థితి విషమం
- ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో ఘటన



ప్రమాదంలో గాయపడిన సత్యకుమార్, ప్రమోద్



ఘటన స్థలంలో మృతి చెంది ఉన్న షేక్‌జానీ

మల్కాపురం: వైద్యులుగా స్థిరపడాలని ఎన్నో కలలుగన్నారు. చదువు కోసం జిల్లాలు దాటి విశాఖ వచ్చారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరో ఇద్దరు ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నారు. వివరాలు ఇలా.. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల ప్రాంతానికి చెందిన షేక్‌జానీ, అనంతపురం ప్రాంతానికి చెందిన సత్యకుమార్, శ్రీకాకుళానికి చెందిన ప్రమోద్‌లు కొమ్మాదిలోని గాయత్రి మెడికల్ కళాశాలలో మెడిసన్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఈ ముగ్గురు ఒకే ద్విచక్రవాహనంపై యారాడ, గంగవరం బీచ్‌కు శుక్రవారం తెల్లవారు జామున బయలుదేరారు. మల్కాపురం పోలీసు స్టేషన్ రోడ్డు నుంచి సింధియా వైపు వెళుతుండగా షిప్‌యార్డ్ కమర్షియల్ కాంప్లెక్స్ సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో షేక్ జానీ అక్కడికక్కడే దుర్మరణం చెందగా.. సత్యకుమార్, ప్రమోద్‌కు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రాంతంలో డివైడర్ పనులు జరుగుతున్నాయి. తవ్విన వ్యర్థాలను తరలించేందుకు అక్కడ ట్రాక్టర్ నిలిపారు. ఇది గుర్తించని యువకులు ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని కేజీహెచ్‌లో చేర్పించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. షేక్‌జానీ మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. జరిగిన సంఘటనపై విచారణ జరుపుతున్నామని మల్కాపురం ఇన్‌చార్జ్ సీఐ దాశరథి చెప్పారు.

ఫార్మాసిటీలో ఐదుగురు కార్మికులకు అస్వస్థత

పరవాడ : స్థానిక ఫార్మాసిటీలోని అజినోమోటో పరిశ్రమలో గురువారం విష వాయువుల లీకైన ఘటనలో ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. పరిశ్రమ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా బాధిత కార్మికులను నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తోంది. శుక్రవారం ఉదయం పరవాడ పోలీసులకు సమాచారం అందడంతో ఆస్పత్రికి వెళ్లి అస్వస్థతకు గురైన కార్మికుల వివరాలను సేకరించారు.

ఈ విషయాన్ని పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు వద్ద ప్రస్తావించగా.. పరిశ్రమలో విషవాయువులు ఏ విధంగా బయటకు వచ్చాయన్న విషయంపై వివరాలు సేకరిస్తున్నామని, అస్వస్థతకు గురైన కార్మికులు సుధాకర్, సతీష్, వర్మ, రామునాయుడు, ఎస్.సాయిల పరిస్థితి మెరుగ్గా ఉందని చెప్పారు. బాధిత కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

క్లుప్తంగా

చల్లబడిన వాతావరణం



ఉదయం ఎండ తీవ్రతతో నిర్మానుష్యంగా ఉన్న మునగపాక మెయిన్‌రోడ్డు

మునగపాక: గత కొద్దిరోజులుగా ఎండవేడిమితో సతమతమవుతున్న మండల ప్రజలు శుక్రవారం మధ్యాహ్నం వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు. రెండు, మూడు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ అధికారులు చెప్పడం అందుకు అనువు గా వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు, ప్రజలు, వృద్ధులు సేద తీరారు.

చర్చ లేకుండా ముగిసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అచ్యుతాపురం: స్థానిక మండల పరిషత్ సమావేశం శుక్రవారం ఎటువంటి చర్చ జరగకుండా ముగిసింది. ఎన్నికల విధుల కారణంగా కొన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాలేదు. ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో 14 మంది సభ్యులు పాల్గొన్నారు. ఎటువంటి చర్చ లేకుండా సమావేశం ముగించారు. ఎంపీడీవో సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంజు భలే తాటి ముంజు



కైలాసపట్నంలో తాటి ముంజులను ఆస్వాదిస్తున్న జనం

కోటవురట్ల : సూరీడు భగభగ మండిపోతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ఉష్ణోగ్రతలు పెరిగి తీవ్ర వడగాడ్పులు వీస్తున్నాయి. రహదారులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ఉష్ణ తాపం నుంచి గట్టెక్కేందుకు శీతల పానీయాలతో పాటు కొబ్బరి బొండాలకు మంచి గిరాకీ ఏర్పడింది.పల్లెల్లో తాటి ముంజులు తినేందుకు పిల్లల నుంచి పెద్దల వరకు పోటీ పడుతున్నారు. కాసేపైనా పచ్చని చెట్ల కింద సేదతీరి తాటిముంజులు తింటే వడదెబ్బ నుంచి బయటపడవచ్చని భావిస్తున్నారు. దాంతో తాటిముంజులు కొట్టేవారికి మంచి డిమాండ్ వచ్చింది. బంధుమిత్రులు, స్నేహితులతో కలిసి తాటిముంజులు తింటూ పల్లె వాతావరణాన్ని ఎంజాయ్ చేస్తున్నారు. వేసవి తాపం నుంచి బయటపడే ప్రయత్నం చేస్తున్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 793 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,300	4,650
మొదటి రకం	3,690	4,640
రెండో రకం	3,610	4,200
మూడో రకం	3,400	3,600

అనకాపల్లి సినిమాలు

ప్రసన్న వదనం	:రాజా
శబరి	:సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	:సత్యనారాయణస్క్రీన్-2
బాక్	:షిర్డిసాయి
ఆ ఒక్కటే అడక్కు	:పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వం	:శ్రీసత్య
డీజే టిల్లు-2	:రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 42 యూనిట్ల శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-3 యూనిట్లు, బి పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 324 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

అవ్వాతాతలకు తప్పని అగచాట్లు



అచ్యుతాపురంలో బ్యాంకు వద్ద పింఛన్‌దారులు

- పింఛన్ సొమ్ముకోసం బ్యాంకుల వద్ద పడిగాపులు
- చంద్రబాబు నాయుడు వల్లే తమకీ దుస్థితి అని ఆవేదన

పింఛనుదారుల కష్టాలు శుక్రవారం కూడా కొనసాగాయి. నగదు తీసుకునేందుకు బ్యాంకుల వద్దకు వెళ్లిన వారు సమస్యలు ఎదుర్కొన్నారు. కదుపులో చల్లకదలకుండా నీడ పట్టునే ఉండి పింఛన్ తీసుకునే తమను చంద్రబాబు ఎండలపాల్జేశారని మండి పడ్డారు. వలంటీర్ల ద్వారా చేతికే అందే నగదు కోసం ఇప్పుడు బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వచ్చిందని వాపోయారు. చంద్రబాబు.. పవన్ కల్యాణ్ తమపై కక్ష కట్టి అవస్థలు పాల్జేశారని.. నడిచే ఓపికే లేని వయసులో కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వచ్చిందని వారు ధ్వజమెత్తారు.

కశింకోట: సామాజిక పింఛన్‌దారులు పింఛన్ నగదు పొందడం కోసం నానా అగచాట్లు పడుతున్నారు. పింఛన్ రాక కొందరు, పింఛన్ వచ్చినా దాన్ని తీసుకోవడానికి బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తూ ఇంకొందరు ఇక్కట్లు పడుతున్నారు. గతంలో గ్రామ వలంటీర్ల ఇంటి వద్దకే వచ్చి సొమ్ము ఇచ్చే వారని, ఇప్పుడు ఇటువంటి దుస్థితి ఏంటని నిట్టూరుస్తున్నారు. మండలంలో 10,572 మంది పింఛన్‌దారులుండగా, వారిలో నడవలేని స్థితిలో ఉన్న వారు, దివ్యాంగులు 2,422 మంది ఉండడంతో వారికి సచివాలయ ఉద్యోగులు పింఛన్ సొమ్ము దాదాపు అందజేశారు. మిగిలిన వారి పింఛన్ సొమ్మును వారి బ్యాంకు అక్కౌంట్లకు జమ చేశారు. దీంతో బ్యాంకులకు వెళ్లి పడిగాపులు కాసి సొమ్ము తీసుకోవలసిన పరిస్థితిని పింఛన్‌దారులు ఎదుర్కొన్నారు. కొందరికి బ్యాంకు అక్కౌంట్లలో పింఛన్ సొమ్ము పడకపోవడంతో బ్యాంకు, సచివాలయ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరుతమ బ్యాంకు అక్కౌంట్లలో సొమ్ముపడిందోలేదోతెలియకసతమతమవుతున్నారు.

అచ్యుతాపురం మండలంలో..

అచ్యుతాపురం: మండలంలో పింఛన్‌దారుల కష్టాలు కొనసాగుతున్నాయి. మే నెల పింఛన్ సొమ్మును బ్యాంక్ ఖాతాల్లో జమచేయడంతో ఆ సొమ్మును విత్‌డ్రా చేసుకునేందుకు వృద్ధులు, మహిళలు బ్యాంక్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం పలు బ్యాంకుల వద్ద పింఛన్‌దారులు అవస్థలుపడ్డారు. గంటలతరబడి వేచి ఉండవలసి వచ్చింది. మండలంలోని 8,240 మందికి పింఛన్ సొమ్ము విడుదల కాగా, 8,033 మందికి బట్వాడ చేసినట్టు ఎంపీడీవో సురేష్‌కుమార్ తెలిపారు.

ఇబ్బంది పడుతూ రావలసి వచ్చింది



గతంలో వృద్ధాప్య పింఛన్ సొమ్ము గ్రామ వలంటీర్ల ద్వారా తమ ఇళ్ల వద్దే అందజేసేవారు. ఇప్పుడు బ్యాంకు అక్కౌంట్లకు జమ చేయడం వల్ల సొమ్ము తీసుకోవడం కోసం తేగాడ గ్రామం నుంచి ఆటోలో ఇబ్బంది పడుతూ వచ్చాను. పింఛన్ సొమ్ము తీసుకోవడం తెలియక బ్యాంకు వద్ద నిరీక్షించవలసి వచ్చింది. దీని దృష్ట్యా నేరుగా గతంలో వలే గ్రామ వలంటీర్ల ద్వారా పింఛన్ సొమ్ము అందించాలి.

–సుంకరి సన్యాసమ్మ, తేగాడ గ్రామం.

పింఛన్ రాలేదు



పింఛన్ నగదు బ్యాంకులో జమ చేస్తారంటే బ్యాంకుకు వచ్చాను. తీరా చూస్తే పింఛన్ సొమ్ము అక్కౌంట్‌లో జమ కాలేదు. సచివాలయానికి వెళ్లమన్నారు. అక్కడ కూడా రాలేదన్నారు. దీంతో పింఛన్ సొమ్ము వస్తుందా? రాదా? అని సతమతమవుతున్నాం.

–మళ్ల దుర్గేష్‌రావు, కశింకోట.

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలి



సమావేశానికి హాజరైన ప్రజలు



మూలపేటలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం రాత్రి గంటవానిపాలెం, మూలపేట,పాటిపల్లి, మంగళవరపుపేట,నాగులాపల్లి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరగాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టాలన్నారు. చంద్రబాబు అండ్‌కో మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరాలంటే ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలన్నారు. అనకాపల్లి ఎంపీ, యలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి. రమణమూర్తిరాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,మార్కెట్‌కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు,సర్పంచ్‌లు భీశెట్టి గంగప్పలనాయుడు,ఆడారి కృష్ణవేణి,జామి చినమ్మలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి,ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్, మూలపేట ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర,పార్టీ నేతలు కేవీఎ నరసింహనాయుడు, సరిసా శ్రీనివాసరావు,బొడ్డేడ లిల్లి,బొడ్డేడ ఆదికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నరేంద్రపురం, మునగపాకలో..

మునగపాక: వైఎస్సార్‌సీపీ నేతలు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మండలంలోని నరేంద్రపురంలో వైస్ ఎంపీపీ బోజా లక్ష్మి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడిముత్యాలనాయుడు, యు.వి.రమణ మూర్తి రాజులను గెలిపించాలని అభ్యర్థించారు. మునగపాకలోని పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు,ఎంపీపీ మళ్ల జయలక్ష్మి,మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు పిల్లి అప్పారావు, ఆడారి కాశీబాబు, రాజాన బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు. నారాయుడుపాలెంలో నిర్వహించిన ప్రచారంలో పార్టీ నేతలు చందనాటి శ్రీనివాసరావు,కొయ్య చక్రం, కొయ్య శేషు తదితరులు పాల్గొన్నారు.



నరేంద్రపురంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నారాయుడుపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నేడు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఎన్నికల ప్రచారం

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే రమణమూర్తిరాజు ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి యాదగిరిపాలెం, మెలిపాక,గణపర్తి, చూచుకొండ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి తరలిరావాలని అచ్చియ్యనాయుడు కోరారు.



మునగపాకలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు



కశింకోటలోని ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

కశింకోటలో..

కశింకోట: మండల కేంద్రం కశింకోటలో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. స్థానిక గవరపేటలోని పెద్ద గుమ్మం వద్ద దుర్గమాంబ ఆలయంలో పూజలు చేసి అనంతరం వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు ప్రచారం ప్రారంభించారు.హౌసింగ్ కాలనీ ప్రాంతంలో ప్రచారం చేసి, కర పత్రాలను పంపిణీ చేసి రానున్న ఎన్నికల్లో పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా ఆశీర్వదించాలని అభ్యర్థించారు.

131 మందికి హోం ఓటింగ్‌కు అవకాశం



హోం ఓటింగ్ కోసం సిద్ధం చేసిన బ్యాలెట్ బాక్సులు



యలమంచిలి ఆర్వో కార్యాలయం నుంచి హోం ఓటింగ్‌కు సామగ్రి తీసుకెళ్తున్న సిబ్బంది

యలమంచిలి రూరల్: నియోజకవర్గంలో కదలలేని స్థితిలో ఉండి దరఖాస్తు చేసుకున్న 131 మంది వయోవృద్ధులు,దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించారు. యలమంచిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో హోం ఓటింగ్ కోసం 6 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు.శుక్రవారం యలమంచిలి ఆర్వో కార్యాలయం నుంచి ఈ ప్రత్యేక బృందాలు హోం ఓటింగ్ నిర్వహించడానికి వాహనాల్లో బయలుదేరి వెళ్లాయి. హోం ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ఓటర్ల ఇళ్లకు వెళ్లి రహస్య విధానంలో ఓటు నమోదు చేయనున్నట్టు అధికారులు చెప్పారు. ఈ విషయాన్ని రాజకీయపార్టీల అభ్యర్థులు,పార్టీల ఏజెంట్లకు కూడా హోం ఓటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని తెలియజేశారు. అంతేకాకుండా ఈ ప్రక్రియ మొత్తాన్ని వీడియో రికార్డ్ చేయిస్తున్నారు.

కశింకోటలో..

కశింకోట: మండలంలో హోం ఓటింగ్‌కు 54 మందికి అవకాశం కల్పించగా, శుక్రవారం 25 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణకు ఎంపీడీవో శేషుబాబు, ఎంఈవో మూర్తిల ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేశారు. సంబంధిత ఓటర్ల ఇళ్లకు పోలింగ్ సిబ్బంది, పోలీసుల బందోబస్తు, బ్యాలెట్‌లతో వెళ్లి ఓట్లు వేయించారు. ఇలా 25 మంది ఓట్లు వేశారని, శనివారం కూడా హోం ఓటింగ్ కార్యక్రమం కొనసాగుతుందని అధికారులు తెలిపారు.



కశింకోట: హోం ఓటింగ్ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

కల్యాణం.. కమనీయం



సిద్ధిబుద్ధి సమేత వినాయకుని కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రాంబిల్లి: పంచదార్ల పుణ్యక్షేత్రం వద్ద గల కల్యాణ వినాయకుని ఆలయంలో శుక్రవారం సిద్ధిబుద్ధి సమేత కల్యాణ వినాయకుని కల్యాణం వైభవంగా జరిగింది.

ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఏటా ఇక్కడ కల్యాణం జరుపుతారు. ఇందులో భాగంగా ఈ ఏడాది భగవత్ భక్తి ప్రచార ట్రస్టు ఆధ్వర్యంలో స్వామి కల్యాణాన్ని కనులపండువలా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని తిలకించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళల కోలాటం ప్రదర్శించారు.



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

బూటకపు మేనిఫెస్టోతో చంద్రబాబు కుయుక్తులు



న్యూకాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



బవులవాడలో వినాయకుని దర్శించుకుంటున్న మలసాల భరత్‌కుమార్

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

అనకాపల్లి: బూటకపు మేనిఫెస్టోతో ఓటర్లను మోసంచేసి అధికారం చేపట్టాలని చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 82వ వార్డు న్యూకాలనీలో వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భరత్‌కుమార్‌కు హారతులు ఇచ్చి దీవించారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 13న జరిగే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును గెలిపించి, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగించారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల మేనిఫెస్టో బలహీన వర్గాల ప్రజల ఆమోదయోగ్యంగా ఉందన్నారు. 14 సంవత్సరాల చంద్రబాబు పాలనలో చెప్పుకోదగిన సంక్షేమ పథకం ఒక్కటి కూడా లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి పలకా రవి,పార్టీ నాయకులు జి.రామ్మూర్తి, కడిమిశెట్టి సతీష్, అల్లు త్రినాథ్, ఉగ్గిన శ్రీనివాసరావు, పలక సత్యనారాయణ, కుండల రామకృష్ణ, కడిమిశెట్టి లక్ష్మణరావు, గుండా రమేష్‌గుప్తా, పసుమర్తి రాము, గ్రంధి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు

మండలంలో బవులవాడ గ్రామంలో సిద్ధి వినాయక ఆలయంలో స్వామిని భరత్‌కుమార్ దర్శించుకున్నారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీయే లక్ష్యంగా కృషి

- జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక: ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తి రాజులు భారీ మెజార్టీతో విజయం సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. మునగపాకలోని బొడ్డేడ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన నవరత్నాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. ఈ నెల 5న మునగపాకలో భారీ ర్యాలీతో పాటు నందీశ్వర ప్రాంగణంలో రాత్రి బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు,,మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, ఉపసర్పంచ్ పెంటకోట సత్యనారాయణ,సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్,పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పార్టీ నేతలు టెక్కలి కొండలరావు, ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు,బొడ్డేడ మహేష్,పెంటకోట శ్రీనివాసరావు,దాడి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ట్రెక్కింగ్, సాహసంలో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ



ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ అనూరాధ

కశింకోట: జాతీయ స్థాయి స్కౌట్స్ అండ్ గైడ్స్ అడ్వంచర్ కార్యక్రమంలో స్థానిక సెయింట్ జాన్స్ స్కూలుకి చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ప్రతిభ చూపి, ప్రశంసా పత్రాలను పొందారు. ఇటీవల మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఈ కార్యక్రమం జరిగింది. దీనిలో సెయింట్ జాన్స్ స్కూలుకి చెందిన ఉపాధ్యాయులైన జిల్లా గైడ్ కమిషనర్ జి.ఉమ, జిల్లా స్కౌట్ అసిస్టెంట్ కమిషనర్ జి.సీహెచ్. నాగేశ్వరరావు, విద్యార్థులు పి.మహేష్, ఎన్. కల్యాణ్‌కుమార్, బి. ప్రియాంక, జి. ప్రియూషలు ట్రెక్కింగ్, సాహస కృత్యాలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అడ్వంచర్ ప్రోగ్రాం ఇన్‌ఛార్జి బిల్‌కిష్ షేక్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకున్నారని స్థానిక స్కూలు ప్రిన్సిపాల్ రూపనంది తెలిపారు. వీరిని స్కూలు కరస్పాండెంట్ బత్తుల అనూరాధ శుక్రవారం అభినందించారు.

వేసవిలో పశువుల సంరక్షణపై శ్రద్ధ అవసరం



గొర్రెలు, మేకల పెంపకందార్లకు అవగాహన కలిగిస్తున్న పశు వైద్యాధికారి చైతన్యమణి



పశువులకు టీకాలు వేస్తున్న పశు ఆరోగ్య సిబ్బంది

కశింకోట: వేసవిలో పశువుల సంరక్షణపై రైతులు శ్రద్ధ వహించాలని నరసింగబిల్లి పశు వైద్యాధికారి చైతన్యమణి అన్నారు. మండలంలోని నరసింగబిల్లిలో పశువులు, గొర్రెల పెంపకందారులకు వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలపై శుక్రవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగిన ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల వల్ల ఇబ్బంది పడకుండా పశువులను సంరక్షించుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన పశువులు 105 డిగ్రీల కంటే ఎక్కువ శరీర ఉష్ణోగ్రత కలిగి ఉంటాయన్నారు. చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టి పడుతుందని చెప్పారు. నోటి వెంట నురుగ కారుతుందన్నారు. పశువులు బలహీనపడి సరిగ్గా నడవలేని స్థితిలో ఉంటాయన్నారు. శ్వాస పీల్చుకోవడం కష్టమై మూర్చ లక్షణాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందుతాయని చెప్పారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో పాడి పశువులను మేతకు వదలరాదని తెలిపారు. తాగునీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని సూచించారు. నాటు జాతి పశువుల కంటే సంకర జాతి పశువులు త్వరగా వడదెబ్బకు గురవుతాయన్నారు. తగినంత పచ్చి మేత వేయాలని తెలిపారు.

పశువులను పాలు తీయడానికి అరగంట ముందు చల్లని నీటితో తడిపితే పాల ఉత్పత్తి పెరగడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. గొర్రెలు, మేకలను కూడా వేసవిలో సంరక్షించాలన్నారు. చల్లని సమయంలో మేత మేపుతూ మధ్యాహ్న సమయంలో నీడలో విశ్రాంతి కల్పించాలన్నారు. చూడితో ఉన్న మేకలు, గొర్రెలు, రెండు నెలలలోపు పిల్లలను నీడపట్టున ఉంచి మేత నందించాలన్నారు. వాటికి నట్టల నివరణ మందులు వేయించాలని సూచించారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



గన్నవరం మెట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న అధికారులు

నాతవరం : నర్సీపట్నం తుని మధ్య ఆర్అండ్‌బీ రోడ్డులో గన్నవరం మెట్ట వద్ద ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేశారు. ఈ ప్రాంతం రెండు జిల్లాల సరిహద్దు కావడంతో పోలీసులతో పాటు ఇతర ఎన్నికలు విధుల్లో ఉన్న అధికారులు సంయుక్తంగా శుక్రవారం వాహనాల తనిఖీలు చేశారు. ఆర్‌టీసీ బస్సులను సైతం తనిఖీలు చేశారు. పోలింగ్ సమయం దగ్గర పడడంతో మద్యం, నగదు రవాణా జరుగుతుందనే కారణంతో ఉన్నతాధికారుల అదేశాలు మేరకు వాహనాలు తనిఖీలు చేపడుతున్నట్టు అధికారులు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో మద్యం గానీ నగదు కానీ పట్టుబడలేదన్నారు.

ఇది కదా అభివృద్ధి

కొండకోనల్లో ప్రగతి పరుగులు


మావోయిస్టుల ప్రభావిత ప్రాంతమైన ముంచంగిపుట్టు మండలం బూసిపుట్టు ప్రాంతానికి నిర్మించిన తారు రోడ్డు


మావోయిస్టుల ప్రభావిత ప్రాంతమైన రంగబయలకు తారురోడ్డు నిర్మాణం

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో రూ.82 కోట్లతో రోడ్లు, కల్వర్టులు

రూ.3 వేల కోట్లతో సంక్షేమం, అభివృద్ధి

వందల సంఖ్యలో గ్రామాలకు మేలు చేసిన జగనన్న సర్కారు

అందుబాటులోకి వచ్చిన ఆధునిక వైద్యసేవలు

గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన అరకు నియోజకవర్గం నేడు ప్రగతిపథంలో దూసుకుపోతోంది. గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయగా ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సుమారు రూ.1500 కోట్ల నిధులు వెచ్చించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసింది. మంచి సంకల్పంతో గ్రామస్వరాజ్య పాలనకు నాంది పలికిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమం, సేవలను చేరువచేశారు. వైద్యం, రవాణా పరమైన సమస్యలను పరిష్కరించారు.

52 వేల మందికి 80 వేల ఎకరాలు..

పోడు భూములపై హక్కు లేక గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. అటవీశాఖ అధికారులు కేసులు నమోదు చేయడంతో వారు సమస్యలు ఎదుర్కొనేవారు. ఈ సమస్యపై దృష్టి సారించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజకవర్గంలో 52వేల మంది గిరిజనులకు 80 వేల ఎకరాలకు ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు అందజేసింది. రైతు భరోసా వర్తింపజేయడంతో గిరి రైతులు సాగు పరంగా ఆర్థిక ఇబ్బందులను అధిగమించారు.


లోతేరులో సచివాలయం

గడప గడపకు నిధులతో..

గిరిజన ప్రాంతంలోని ఒక్కో సచివాలయానికి ప్రభుత్వం రూ.40 లక్షలు వెచ్చించింది. ఈ నిధులతో హుకుంపేట, అనంతగిరి, ముంచంగిపుట్టు మండలాల పరిధిలోని 30 గ్రామ సచివాలయాల పరిధిలో సీసీరోడ్లు, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ పనులు చేపట్టారు.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

పథకం	లబ్ధిదారులు	లబ్ధి
పింఛను కానుక	39,750	576 కోట్లు
అమ్మ ఒడి	38,692	133.56 కోట్లు
చేయూత	12,287	23.41కోట్లు
రైతు భరోసా	124,894	16.86 కోట్లు
సున్నా వడ్డీ	10,256	5.12 కోట్లు
విద్యాదీవెన	12,050	16.50 కోట్లు
కాపు నేస్తం	210	31.50 లక్షలు
వసతిదీవెన	6300	6.50 కోట్లు
ఈ బీసీనేస్తం	30	4.50 లక్షలు
బీమా	1020	1. 2 కోట్లు
వాహనమిత్ర	2366	2.36 కోట్లు
తోడు	915	9.15 కోట్లు
సున్నా వడ్డీ పంట రుణాలు	1950	3.90 కోట్లు
ఇతర పథకాలు		
జగనన్న చేదోడు	1,103	1.10కోట్లు
ఆరోగ్యశ్రీ	5100	12 కోట్లు
ఆసరా	16,100	18.50 కోట్లు
కళ్యాణమస్తు	26	26 లక్షలు
కోవిడ్ సాయం (తెల్ల రేషన్ కార్డు)	94,414	9.44 కోట్లు
ఆరోగ్య ఆసరా	3250	22 కోట్లు
మత్స్యకార భరోసా	12	1.2 లక్షలు
జగనన్నతోడు రుణాలు	3800	80 లక్షలు
నాన్ డీబీటీ పథకాల లబ్ధి		
జగనన్న గోరుముద్ద	21,200	2.10 కోట్లు
సంపూర్ణ పోషణ	5200	3కోట్లు
ట్యాబ్‌లు	3800	5.70 కోట్లు
ఇళ్లస్థలాలు	8900	12.20 కోట్లు
విద్యాకానుక	34వేలు	24 కోట్లు

అరకులోయ నియోజకవర్గం

మండలాలు	6
పంచాయతీలు	135
గ్రామాలు	2,600
సచివాలయాలు	125

అనంతగిరి (అరకులోయ): గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పరుగులు పెడుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో గణనీయమైన ప్రగతి సాధించడంతో గిరిజనులు మురిసిపోతున్నారు. విస్తీర్ణపరంగా అరకు నియోజకవర్గం పెద్దది కావడంతో మారుమూల గ్రామాల నుంచి మండల కేంద్రానికి వచ్చేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సుమారు 50 నుంచి 150 కిలోమీటర్లు ప్రయాణం చేస్తేనే గానీ మండల కేంద్రానికి చేరుకోలేని పరిస్థితి. గెడ్డలు, వాగులు దాటుకుంటూ కాలినడకన సుదూర ప్రాంతం నడుచుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. వీటిపై గత ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం చేయగా ప్రస్తుత ప్రభుత్వం పరిష్కారంపై దృష్టి సారించింది. అంచెలంచెలుగా బ్రిడ్జిలు, కల్వర్టులు నిర్మించి సౌకర్యాలు కల్పించింది.

అభివృద్ధి ఇలా..

అనంతగిరి, అరకువేలి, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో రూ.215.38 కోట్లతో గిరిజన సంక్షేమశాఖ గ్రావెల్, బీటీ, తారురోడ్డు, వంతెన తదితర సుమారు 449 పనులు చేపట్టింది.

- రోడ్లు, వంతెనలు తదితర 121 నిర్మాణ పనులకు పంచాయతీ రాజ్ ప్రాజెక్టుల నిధులు రూ.376.66 కోట్లు వెచ్చించింది.
- పంచాయతీరాజ్ నిధులతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, సీసీరోడ్లకు సంబంధించి 761 పనులకు రూ.210.90 కోట్లు కేటాయించింది. ఆరు మండలాల్లో 105 సచివాలయాలు ఉండగా వీటిలో 28 చోట్ల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. రైతు భరోసా కేంద్రాలు 97కుగాను 28, వెల్‌నెస్ సెంటర్లు 47కుగాను మూడు చోట్ల భవనాలను నిర్మించింది.
- మారుమూల గ్రామాల్లో తాగునీరు అందించేందుకు జల జీవన్ మిషన్ పథకంలో 3,752 పనులకు రూ.318.10 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. నియోజకవర్గంలో రూ.1121.04 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.
- నియోజకవర్గంలో నాడు- నేడు మొదటి, రెండో విడత సుమారు రూ.130 కోట్లను కేటాయించింది. దీంతో 500కు పైగా పాఠశాలల భవనాల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ పాఠశాలలను తలపిస్తున్నాయి.

నదులు, గెడ్డలపై బ్రిడ్జిల నిర్మాణం..

మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారుల్లో నదులు, గెడ్డలపై కీలకమైన బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.

అనంతగిరి మండలంలో..

- చిలకలగెడ్డ సమీపంలోని జీలుగులపాడు గోస్తనీ నదిపై రూ.2.2కోట్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ దశలో ఉంది. పూర్తయితే సుమారు 50 గ్రామాలకు సౌకర్యవంతంగా ఉంటుంది.


సారవానిపాలెం వద్ద గోస్తనీ నదిపై నిర్మించిన వంతెన


అరకులోయలో నిర్మించిన అగ్రి ల్యాబ్

- కాశీపట్నం సమీపంలోని సారవానిపాలెం వద్ద గోస్తనీ నదిపై రూ.2 కోట్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సుమారు 20 గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పాయి.

డుంబ్రిగుడ మండలంలో..

- మారుమూల గసభ పంచాయతీ లోగిలి గెడ్డపై వంతెన లేక సుమారు 20 గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఏళ్లనాటి సమస్యకు రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెట్టింది. గిరిజనసంక్షేమ శాఖ నిధులు రూ.1.80 కోట్లతో వంతెన పూర్తి చేయడంతో ఆయా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పాయి.

హుకుంపేట మండలంలో..

- తీగలవలస పంచాయతీ అమూరు గెడ్డపై గిరిజన సంక్షేమశాఖ నిధులు రూ.40 లక్షలతో చేపట్టిన వంతెన నిర్మాణం పూర్తయింది. సుమారు 8 గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వచ్చింది.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో..

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కనీసం మౌలిక వసతులు లేక గిరిజనులు ఇబ్బందులు పడేవారు. పాడేరు కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటుతో ఇటువంటి గ్రామాలపై అధికార యంత్రాంగం ప్రత్యేకదృష్టి సారించింది. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలైన గిన్నెలకోట, జామిగుడ, ఇంజిరి, రంగబయల్,బూంగపుట్టు, బూసిపుట్టు, కుడమ పంచాయతీల్లోని గ్రామాలు నేడు ప్రగతి పథంలో నడుస్తున్నాయి.

- ఆయా ప్రాంతాల్లో రోడ్లు, కల్వర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.82 కోట్లు వెచ్చించింది.
- వనగుమ్మ నుంచి రంగబయల మీదుగా జోడిగుమ్మ వరకు రూ.16.90 కోట్ల పీఆర్ ప్రాజెక్టు నిధులతో రోడ్డు, కల్వర్టు నిర్మాణం చేపట్టింది. దీంతో 26 గ్రామాలకు మేలు చేకూరింది.
- రూడకోట నుంచి బూసిపుట్టు పంచాయతీ కేంద్రం మీదుగా ఒడిశా సరిహద్దు వరకు కూడా రూ.15.40 కోట్ల పీఆర్ ప్రాజెక్టు నిధులతో 26 కిలోమీటర్లు రోడ్డు, కల్వర్టు నిర్మించడంతో 50 గ్రామాల ప్రజలకు అవస్థలు తప్పాయి.
- లుబ్బూరు జంక్షన్ నుంచి బూంగపుట్టు పంచాయతీ కేంద్రం వరకు పీఆర్ ప్రాజెక్ట్ నిధులు సుమారు రూ.13.84 కోట్లతో రోడ్డును ప్రభుత్వం నిర్మించింది. బిరిగూడ వద్ద వంతెన నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. దీనివల్ల ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లోని 45 గ్రామాల ప్రజల సమస్య శాశ్వతంగా పరిష్కారమైంది.
- గుల్లెలు నుంచి ఇంజరి మీదుగా కొండ్రుం వరకు పీఆర్ ప్రాజెక్టు నిధులు సుమారు రూ.16.80 కోట్లతో 18 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం ప్రభుత్వం చేపట్టింది. దీంతో గుల్లెలు, బొంగరం, గిన్నెలకోట, ఇంజరి నాలుగు పంచాయతీల్లో సుమారు 60 గ్రామాలకు రవాణా సమస్య పరిష్కారమైంది.
- జి.మాడుగుల మండలం బోయితిలి నుంచి జక్కం మీదుగా కొండ్రుం వరకు పీఆర్ ప్రాజెక్టు నిధులు రూ.14 కోట్లతో రోడ్డు నిర్మాణం జరుగుతోంది. ఇప్పటివరకు జక్కం వరకు బీటీ రోడ్డు పూర్తయింది. మిగతా పనులు చురుగ్గా జరుగుతున్నాయి. దీనివల్ల సుమారు 30 గ్రామాలకు మేలు జరగనుంది.
- గిన్నెల, జామిగుడ గెడ్డలపై రెండు వంతెనలకు గాను ట్రైబల్ వెల్ఫేర్ నిధులు సుమారు రూ.4 కోట్లతో రోడ్డు నిర్మిస్తున్నారు. దీనివల్ల 40 గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకంగా..


రూ.40 లక్షలతో అభివృద్ధి చేసిన చాపరాయి జలపాతం

గతం ప్రభుత్వం పర్యాటక రంగ అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. ప్రస్తుత ప్రభుత్వం పర్యాటకుల సౌకర్యార్థం సందర్శిత ప్రాంతాలను అభివృద్ధి చేసింది. పర్యాటకులు కొత్త అనుభూతి పొందేలా తీర్చిదిద్దింది.

- అనంతగిరి మండలంలోని మర్రగుడ వద్ద అటవీశాఖ పెద్ద ప్రాజెక్టు శ్రీకారం చుట్టింది. సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో సుమారు 5.5కోట్లతో సీతకోక చిలుకప్రాజెక్టు నిర్మాణం చేపట్టింది. వీఎస్ఎస్(వనసంరక్షణ సమితి) పరిధి కావడంతో మర్రగుడ గ్రామానికి చెందిన సుమారు 60 కుటుంబాలకు ఉపాధిపరంగా మేలు జరుగుతోంది. ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బొర్రాగుహల వద్ద పర్యాటకశాఖ ఆధ్వర్యంలోని రూ.75 లక్షలతో గోస్తనీ నదిపై జిప్ లైప్ ఏర్పాటు చేయడంతో సుమారు 20 మంది గిరిజనులకు ఉపాధి అందుబాటులోకి వచ్చింది.
- అనంతగిరి మండలం చిలకలగెడ్డ వద్ద ఎకో పార్కుతో పాటు సుమారు రూ.70 లక్షలతో అరకు అంజోడ పార్కును అభివృద్ధి చేశారు. ఐటీడీఏ ఆధ్వర్యంలోని సుమారు రూ.40 లక్షలతో చాపరాయి జలపాతాన్ని పర్యాటకులను ఆకట్టుకునేలా అత్యాధునికంగా తీర్చిదిద్దారు.

పీహెచ్‌సీలకు మహర్దశ



నియోజకవర్గంలో నాడు- నేడు పథకంలో పీహెచ్‌సీలను ప్రభుత్వం ఆధునీకీకరించింది. అనంతగిరి, లంగుపర్తి, భీమవరం పీహెచ్‌సీల భవనాలకు 1.10 కోట్లతో మరమ్మతులు చేపట్టింది. సుమారు రూ.1.28 కోట్లతో సుంకరమెట్ట, మాడగడ, గన్నెల, రూ.1.26 కోట్లతో కిల్లోగుడ, డుంబ్రిగుడ పీహెచ్‌సీల భవనాలకు మరమ్మతులు చేపట్టింది.

గర్భిణుల కోసం..

గర్భిణుల సౌకర్యార్థం ఆరు మండలాల్లో బర్త్ వెయిటింగ్‌హాళ్లు ఏర్పాటు చేసింది. అన్ని సౌకర్యాలు కల్పించి, ప్రసవ సమయానికి ముందే గర్భిణులను ఆస్పత్రికి చేర్చి, సుఖ ప్రసవానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

టీడీపీ హయాంలో గిరిజనాభివృద్ధి శూన్యం

గత టీడీపీ ప్రభుత్వం గిరిజనాభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే గిరిజనులు పట్టం కట్టడంతో ఎమ్మెల్యేగా కిడారి సర్వేశ్వరరావు ఎన్నికయ్యారు. కొంతకాలం తరువాత ఆయన అధికార టీడీపీలో చేరారు. ప్రజా సమస్యలపై ఆయన దృష్టి సారించిన సందర్భాలు లేవు. ప్రధాన సమస్యలను పూర్తిగా విస్మరించారు. అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ గోస్తనీ నదిపై హుద్‌హుద్ తుపానుకు కొట్టుకుపోయిన కాజ్‌వే స్థానంలో బ్రిడ్జి నిర్మాణానికి టీడీపీ పాలకులు హామీ ఇచ్చినా నెరవేర్చలేకపోయారు. చిలకలగెడ్డ పంచాయతీ జీలుగులపాడు గోస్తనీ నదిపై వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చిన చేపట్టలేదు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దత్తత తీసుకున్న పెదలబుడు పంచాయతీలోని గ్రామాలను అభివృద్ధి చేయలేదు. ఈ పంచాయతీ పరిధిలోని 28 గ్రామాల్లో తూతూమంత్రంగా పనులు చేపట్టి మమ అనిపించారు. చంద్రబాబు దత్తత తీసుకోవడంతోఆ పంచాయతీ గిరిజనులు ఎంతో ఆశపడ్డారు. అయితే ఆయన అభివృద్ధిని విస్మరించి వారికి నిరాశ మిగిల్చారు.

కనీవినీ ఎరుగని ప్రగతి



స్వాతంత్య్రం వచ్చి సుమారు 70 ఏళ్లు గడుస్తున్నా ఎన్నడూలేని అభివృద్ధిని ఈ నాలుగున్నరేళ్లలో నియోజకవర్గ ప్రజలు చూశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు సేవ చేయడం ఎంతో సంతోషంగా ఉంది. ఎన్నికల ముందు గ్రామాల్లో తిరిగినప్పుడు అనేక హామీలను ఇచ్చాం. వాటన్నింటిని సీఎం సహకారంతో నెరవేర్చగలిగాం. అభివృద్ధికి సుమారు రూ.1500 కోట్లు, వివిధ పథకాల రూపేణా లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం రూ.1500 కోట్లు జమ చేసింది.

– చెట్టి పాల్గుణ, అరకు ఎమ్మెల్యే

మారుమూల గ్రామాల అభివృద్ధిపై దృష్టి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో దాదాపుగా గ్రామాలన్నీ అభివృద్ధి చెందాయి. హుకుంపేట జెడ్పీటీసీగా పనిచేసినందున ప్రజా సమస్యలపై అవగాహన ఉంది. గిరిజన గ్రామాలకు వెళ్లినప్పుడు గుర్తించిన మేజర్ సమస్యలను ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేశా. మిగతా చిన్న చిన్న సమస్యల పరిష్కారానికి మండల, జిల్లా పరిషత్ నిధులు వెచ్చించి పరిష్కరించ గలిగాను. మారుమూల గ్రామాల్లో సైతం పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది.

– రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ అరకు అసెంబ్లీ అభ్యర్థి

ఈవీఎంలో అభ్యర్థుల కూర్పు ఇలా..

మీకు తెలుసా?

యలమంచిలి రూరల్ : ఈవీఎంలో తాను ఎక్కడున్నదీ ఓటరుకు తెలపడానికి అనువైన నంబరు, చోటు కోసం అభ్యర్థులు అపసోపాలు పడుతుంటారు. అధికారులు మాత్రం బ్యాలెట్ కూర్పులో ఏ మాత్రం పొరపాటు లేకుండా ఎన్నికల కమిషన్ సూచించిన నియమావళి, మార్గదర్శకాలను అనుసరించి ఒకటికి రెండు సార్లు చూసి వివరాలు ప్రకటిస్తారు.

అదెలాగంటే..



- తొలుత గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీల అభ్యర్థులను ఎంచుకుంటారు. నామినేషన్ పత్రాల్లో తమ పేరు, ఇంటి పేరు నమోదు చేయడంలో ఒక్కొక్కరిది ఒక్కో పద్ధతి.
- అందుకే నామినేషన్లతో పాటు బ్యాలెట్‌లో అభ్యర్థి పేరు ఎలా ఉండాలని కోరుకుంటారో.. ప్రత్యేకంగా రాసి ఇవ్వాలని సూచిస్తారు. ఇదే బ్యాలెట్‌లో సదరు అభ్యర్థికి చోటు కేటాయించేందుకు అధికారులకు తోడ్పతుంది.
- అభ్యర్థుల ప్రాధాన్యతాక్రమాన్ని నిర్ధారించేందుకు మొదట జాతీయ పార్టీలకు సంబంధించి అభ్యర్థుల పేర్లను పరిశీలిస్తారు.
- వారిచ్చిన పేరులో మొదటి అక్షరాలను పరిశీలించి, తెలుగు వర్ణమాల లోని అక్షరాలు, గుణింతాల ఆధారంగా వరుస క్రమాన్ని నిర్ధారిస్తారు.
- జాతీయ పార్టీల అభ్యర్థులను గుర్తించి వారికి వరుస నంబరు కేటాయించిన అనంతరం గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీ అభ్యర్థులను నమోదు చేస్తారు.
- ఒకటి కన్నా ఎక్కువ రాష్ట్ర పార్టీల అభ్యర్థులుంటే వారికిచ్చిన పేరు వివరాలతో తెలుగు వర్ణమాలను అనుసరించి వరుసలో కేటాయిస్తారు.
- ఆ తర్వాత స్వతంత్ర అభర్థుల పేర్లను కూడా అదే పద్ధతిలో కేటాయిస్తారు.

మీ ఓటు ఎవరో వేశారా?

మహారాణిపేట (విశాఖ): ఎన్నికల్లో ఓటేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లే సరికి మీ ఓటు వేరేవారు వేసేశారా? అయితే దిగులుపడాల్సిన అవసరం లేదు. మీకు టెండర్ ఓటు వేసే హక్కును ఎన్నికల సంఘం కల్పించింది. ఈవీఎం ద్వారా కాకుండా పేపర్ బ్యాలెట్ ద్వారా ఓటేసే అవకాశం కల్పిస్తారు. టెండర్ బ్యాలెట్ ఓటర్ల వివరాలను ప్రిసైడింగ్ అధికారులు ఫారం-17బీలో రికార్డు చేస్తారు. ఈ ఫారంలోని 5వ కాలమ్‌లో ఓటరు సంతకం/వేలి ముద్రను తీసుకున్న తర్వాత వారికి బ్యాలెట్ పత్రం అందజేస్తారు. ప్రత్యేక ఓటింగ్ కంపార్ట్ మెంట్‌లోకి ఓటరు బ్యాలెట్ పత్రాన్ని తీసుకెళ్లి తాము వేయదలచిన అభ్యర్థికి చెందిన ఎన్నికల గుర్తుపై స్వస్తిక్ ముద్ర వేయాల్సి ఉంటుంది. ఓటెవరికి వేశారో బయటకు కనబడని విధంగా బ్యాలెట్ పత్రాన్ని మడిచి కంపార్ట్‌మెంట్ బయటకి వచ్చి ప్రిసైడింగ్ అధికారికి అందజేయాలి. ఆ బ్యాలెట్ పత్రాన్ని టెండర్ ఓటుగా ప్రిసైడింగ్ అధికారి మార్క్ చేసి ప్రత్యేక కవర్‌లో వేరుగా ఉంచుతారు.


రాజకీయ చైతన్యానికి ప్రతీక

ఎన్నో ప్రత్యేకతలు పెందుర్తి సొంతం

ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న ప్రాంతం

ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి

మొత్తం ఓటర్లు	3,07,545
పురుషులు	1,52,592
స్త్రీలు	1,54,948
ఇతరులు	5



పెందుర్తి ముఖచిత్రం

మట్టి వాసనతో చక్కటి గ్రామీణం.. ఆధునిక పోకడలతో అందమైన పట్టణం.. అదే పెందుర్తి నియోజకవర్గం. విజయనగర సామ్రాజ్యాన్ని పాలిస్తున్న కాలంలో శ్రీకృష్ణదేవరాయలు పెందుర్తి ప్రాంతంలో సేద తీరేవారని చరిత్ర చెబుతోంది. అనంతరం బ్రిటిష్ కాలంలో పెందుర్తి మండలం పెదగాడి రాణా కేంద్రంగా కప్పం కట్టించుకునేవారు. ఒకవేళ కప్పం కట్టకపోతే ఇక్కడే రాయికి కట్టి శిక్షలు విధించేవారని పెద్దలు చెబుతుంటారు. రాజుల కాలంలో పెందుర్తి ప్రాంతాన్ని పెదగాడి రాణాగా పరిగణించేవారు. కాల క్రమేణా బ్రిటిష్ కాలం నాటికి పెందుర్తిగా నామకరణం జరిగింది. నియోజకవర్గ పరిధిలోని పరవాడలో సముద్రతీరం ఉండడంతో స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉప్పు సత్యాగ్రహం పోరాటంలో భాగస్వామ్యమైంది. అలాగే మన్యం బిడ్డ అల్లూరి సీతారామరాజు స్వాతంత్య్ర పోరాటంలో భాగంగా పెందుర్తిలో పలుమార్లు ప్రజల్లో చైతన్యం నింపేందుకు పర్యటించారని చెబుతారు. అలా స్వాతంత్ర్యం వచ్చాక రాజకీయ చైతన్యం కలిగిన ప్రాంతంగా పెందుర్తి గుర్తింపు తెచ్చుకుంది. ఎంతో మంది ఉద్ధండులు.. ఈ ప్రాంతంలో పుట్టి రాష్ట్ర స్థాయిలో రాజకీయంగా పేరుగాంచారు.

-పెందుర్తి

నియోజకవర్గ స్వరూపం

తొలుత పరవాడగా ఉన్న ఈ నియోజకవర్గం.. 2009లో నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పెందుర్తి నియోజకవర్గంగా మారింది. ఓ రకంగా చెప్పాలంటే పరవాడ నియోజకవర్గానికి పెందుర్తిగా నామకరణం చేశారు. గతంలో పెందుర్తి నియోజకవర్గంలోని ప్రాంతాలన్నీ ప్రస్తుతం విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఉన్నాయి. నియోజకవర్గంలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాలు పూర్తిగా, పెదగంట్యాడ మండలం(కొద్ది భాగం)తో పాటు జీవీఎంసీ 88, 93, 94, 95, 96, 97, 98 వార్డులు ఉన్నాయి. ఈ నియోజకవర్గానికి తూర్పున భీమిలి, ఉత్తరాన ఎస్.కోట(విజయనగరం), దక్షిణాన గాజువాక, విశాఖ పశ్చిమ, పడమరన మాడుగుల నియోజకవర్గాలు సరిహద్దులుగా ఉన్నాయి.

రాజకీయ పోరు

ఈ ప్రాంతం పరవాడ నియోజకవర్గంగా ఉన్నప్పుడు 1972, 1976లో కాంగ్రెస్ తరఫున బాటం శ్రీరామ్మూర్తి గెలుపొందారు. ముఖ్యమంత్రి టి.అంజయ్య క్యాబినెట్‌లో మంత్రిగా బాటం పనిచేశారు. 1983లో టీడీపీ నుంచి పైలా అప్పలనాయుడు గెలుపొందారు. ఆ తర్వాత 1985లో జరిగిన ఉపఎన్నికల్లో కూడా పైలా విజయం సాధించారు. 1989, 94, 99 వరుసగా బండారు సత్యనారాయణమూర్తి టీడీపీ తరఫున గెలిచారు. 2004లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన గండి బాబ్జీ బండారు వరస విజయాలకు బ్రేక్ వేసి ఘన విజయం సాధించారు. 2009లో జరిగిన నియోజకవర్గ పునర్విభజనతో పెందుర్తి నియోజకవర్గం ఏర్పాటైంది. 2009లో ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీ చేసిన పంచకర్ల రమేష్‌బాబు అనూహ్యంగా గెలుపొందారు. ఎన్నికల నామినేషన్ నాటికి పంచకర్ల ఎవరో కూడా నియోజకవర్గ ప్రజలకు తెలియదు. 2014లో టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి వైఎస్సార్ సీపీ అభ్యర్థి గండి బాబ్జీపై గెలుపొందారు. 2019లో వైఎస్సార్ సీపీ తరఫున అన్నంరెడ్డి అదీప్‌రాజ్ టీడీపీ అభ్యర్థి బండారుపై 29 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు.


దేవీపురంలోని శ్రీచక్రాలయం







2024 ఎన్నికల ముఖచిత్రం..

ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, జనసేన తరఫున పంచకర్ల రమేష్‌బాబు ప్రధాన అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. అయితే పంచకర్ల అభ్యర్థిత్వంపై టీడీపీ నాయకత్వంతో పాటు స్థానికుల్లో వ్యతిరేకత ఉంది. పదేళ్లుగా నియోజకవర్గానికి దూరంగా ఉండి, కనీసం కరోనా వంటి సమయంలో కూడా పెందుర్తి వైపు పంచకర్ల ఏ రోజూ చూడలేదు. ఎన్నికలకు ముందు అభ్యర్థిగా తెరపైకి రావడంతో పెద్దగా ప్రజల్లో తిరిగిన దాఖలాలు లేవు. మరోవైపు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణ మూర్తిపై వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ 29 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించడమే దీనికి నిదర్శనం. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలతో ఎస్సీలు, బీసీలు, ఇతర మైనారిటీ వర్గాలు వైఎస్సార్‌సీపీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు కనిపిస్తోంది.

నియోజకవర్గ ప్రత్యేకతలివే

నియోజకవర్గంలోని ఏకైక రైల్వే స్టేషన్ పెందుర్తి పట్టణంలో ఉంది. ఇది 1962లో ఏర్పడింది. • దేశవ్యాప్తంగా ప్రసిద్ధిగాంచిన విశాఖ శ్రీశారదా పీఠం పెందుర్తిలోనే ఉంది. • మేహాద్రి గెడ్డ రిజర్వాయర్ పెందుర్తికి సమీపంలోనే ఉంది. • వెంకటాద్రి రోజురోజుకూ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. • దేవిపురంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన శ్రీచక్రాలయంలో రాజరాజేశ్వరి మాత కొలువై ఉంది.• సబ్బవరం మండలంలో జాతీయ లా యూనివర్సిటీ, జాతీయ మారిటైం వర్సిటీలు ఉన్నాయి. జాతీయ పెట్రో యూనివర్సిటీ తుది దశ నిర్మాణంలో ఉంది. • పరవాడ సముద్రతీరంలో ఉన్న ఎన్టీపీసీలో నాలుగు యూనిట్ల ద్వారా 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. • ఫార్మాసిటీలో 94 ఫార్మా సంస్థల ద్వారా మందులు, వైద్య పరికరాలు, ఇతర వైద్య పరమైన ఉత్పత్తులు ఉత్పత్తి చేస్తున్నారు. • పరవాడ సముద్ర తీరంలో 250 ఎకరాల్లో ఉప్పు సాగు చేస్తున్నారు.


పెందుర్తిలోని శ్రీశారదాపీఠం


పరవాడలోని సింహాద్రి ఎన్టీపీసీ